క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన లింగాల



కలెక్టర్‌కు జ్ఞాపిక అందిస్తున్న కమల్‌రాజ్

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మంగళవారం ఐడీఓసీలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు.

విజయవంతం చేయండి

కూసుమంచి: వచ్చే నెల 1, 2 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పీవోడబ్ల్యూ రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షురాలు పి.లక్ష్మక్క పిలుపునిచ్చారు. మంగళవారం కూసుమంచి మండల కేంద్రంలో సభలకు సంబంధించిన పోస్టర్లను ఆమె విడుదల చేశారు. మహాసభల సందర్భంగా ఈ నెల 31న భారీ బహిరంగ సభ నిర్వహించబడుతుందన్నారు. దిశ, నిర్భయ చట్టాలు తీసుకొచ్చినా మహిళలపై అత్యాచారాలు, అకృత్యాలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మానవ అవయవాల రవాణాను ప్రశ్నించినందుకు కోల్‌కతాలో జూనియర్ ట్రెయినీ డాక్టర్‌ను అత్యాచారం చేసి అతికిరాతకంగా హతమార్చారన్నారు. ఈ ఘటనలో ఇంతవరకు దోషులను అరెస్ట్ చేయకపోవడం సిగ్గుచేటని, మహిళలు తమ హక్కులు, రక్షణ కోసం సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, కళావతి, సభ్యులు విజయ, నర్సమ్మ, హేమలత, శ్యామలత, సంధ్య, సత్యావతి, తదితరులు పాల్గొన్నారు.

సంతాపం

ఖమ్మం లీగల్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాదుడు గండికోట చంద్రశేఖర్ శాస్త్రి, మహిళా న్యాయవాది కె.పద్మకుమారిలు మృతి చెందారు. వారి మృతికి ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, బార్ కార్యవర్గం, న్యాయవాదులు ఓరుగంటి శేషగిరిరావు, షేక్ లతీఫ్, మువ్వా నాగేశ్వరరావు, ఇమ్మడి లక్ష్మీనారాయణ, కొండపల్లి శ్రీనివాసచౌదరి, తెల్లాకుల రమేష్బాబు, జి.వి.లక్ష్మీనారాయణ, పి.దానయ్య, ఆకుల శేఖర్బాబు, చింతల వెంకట్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

బాకీ వసూలు విషయంలో ఘర్షణ

కామేపల్లి: ఓ రైతు విత్తన దుకాణదారుడికి చెల్లించాల్సిన బాకీ సొమ్ము విషయంలో ఘర్షణ జరిగిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నవి. మండలంలోని మద్దిగూడెం గ్రామానికి చెందిన కిలారు శ్రీను అనే రైతు సాతానిగూడెం గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడికి విత్తన, పురుగు మందులు కొనుగోలు చేసి సందర్భంలో సుమారుగా రూ.3 వేలు బాకీ ఉన్నాడు. అయితే అట్టి సొమ్మును మంగళవారం ఇస్తానని చెప్పడంతో బాకీ వసూల్ చేసేందుకు ఫర్టిలైజర్ నిర్వాహకుడు రైతు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో రైతు, డీలర్‌కు మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇరువర్గాల మధ్య జరిగిన ఈ ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి.

విద్యపై దృష్టి సారించాలి

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు విద్యపై దృష్టి సారిస్తూ ముందుకు సాగాలని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రొఫెసర్, ప్రజాకవి, కాళోజీ నారాయణరావు అవార్డు గ్రహీత డాక్టర్ రావులపాటి సీతారాం అన్నారు. మంగళవారం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యపై ఏకాగ్రతను దారిమళ్లించేలా నేటి పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నుంచి ఎలా బయటపడాలనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన జరిగిన ప్రిన్సిపాల్ కె.ఎస్.రామారావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామయ్య, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఇఫ్టూ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ప్రభుత్వాస్పత్రిలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జ్వరాలతో ఆస్పత్రికి వందల సంఖ్యలో వస్తున్నా అవేమి పట్టించుకోకుండా తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారన్నారు. ఇకనైనా వారికి పెండింగ్ వేతనాలతో పాటు కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకుడు ఆవుల అశోక్, యూనియన్ నాయకులు హిరాలాల్, సైదావలీ, పగిడికత్తుల శ్రీలత, అనిత, రంగమ్మ, వీరకుమారి, కమలమ్మ, సుజాత, యశోద, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 29వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో సుమారు రూ.95 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్టోమ్ వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ కొప్పెర సరిత ఉపేందర్, సాధు రమేష్‌రెడ్డి, యలగొండలస్వామి, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, వెంకన్న, సైదులు, ఖాదర్‌బాబా, చోటేబాబా, కోసూరు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్ నీరజ

ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ సందర్శన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం సందర్శించారు. హెల్ప్‌డెస్క్ వద్ద ఉన్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనల ప్రకారం దరఖాస్తుదారులు అంతా తమ పూర్తి వివరాలతో కూడిన డాక్యుమెంట్లను సకాలంలో అధికారులకు అందజేయాలన్నారు. అలాగే హెల్ప్‌డెస్క్ వద్దకు వచ్చే ప్రజల అనుమానాలను నివృత్తి చేసి, వారికి సరైన సమాధానం ఇచ్చి పంపించాలని సిబ్బందికి మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు దివ్య, కల్యాణ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మేయర్ పునుకొల్లు నీరజ

రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించాలి

తిరుమలాయపాలెం: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు బేసిక్ పే నిర్ణయించి అమలు, జీతాలు పెంపుదల చేయాలని, రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.ఐదు లక్షల చెల్లించాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం తిరుమలాయపాలెం కేజీబీవీలో నాన్ టీచింగ్ వర్కర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలిక విద్యాభివృద్ధికి దోహదపడే కేజీబీవీలో పనిచేసే సిబ్బందికి కనీస వేతనాలు అమలు కావడంలేదని, ప్రభుత్వమే మహిళా ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించడం దుర్మార్గమన్నారు. రిటైర్మెంట్ అయిన వారి జీవితాలకి ఎలాంటి భద్రతా, భరోసా లేకుండా పోవడం వివక్ష కొనసాగించడమే అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీ సిబ్బందిపై తీవ్ర నిర్లక్ష్యం కొనసాగించడం సరైనది కాదన్నారు. కేజీబీవీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ.. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, లక్ష్మి, రమ, సుజాత, రామ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్ర సదస్సు పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంఅర్బన్: వచ్చే నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం నగరంలోని ఖానాపురం ఏసు క్రీస్తు స్వస్థత ప్రార్థన మందిరంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్, ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ కె.ప్రసాద్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన క్రిస్టియన్ జేఏసీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ ఫలాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా జేఏసీ చైర్మన్ లాథియా, కన్వీనర్ పద్మ, పాస్టర్లు యేసు రత్నం, ప్రిస్కిల్లా, సుజాత, జానమ్మ, ఇందిర, రెబ్కా, జిల్లా అధికార ప్రతినిధి సలహాదారుడు స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ

ఖమ్మంరూరల్: ప్రభుత్వం అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందిస్తుందని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకురాలు సరిత అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నెకల్ రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. రుణమాఫీ కాని రైతులకు రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అందుకు ప్రత్యేక యాప్ ద్వారా రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక రేషన్ కార్డు లేని వారి ఫ్యామిలీ గ్రూపింగ్‌ను సైతం ఈ యాప్ ద్వారా నమోదు చేస్తున్నామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఉమా నగేష్, రైతు శిక్షణ కేంద్రం ఏడీ అరుణకుమారి, ఏఈఓలు ఆదర్శ్, వంశీ, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం రీజియన్ పరిధిలోని డిపోల ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ నాయకులు పాటి అప్పారావు, తిమ్మినేని రామారావు, కందుల భాస్కర్‌రావు, ఎల్‌ఆర్‌కే రావు, పిల్లి రమేష్, నాగరాజు, బాలశౌర్యులు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2013 ఆర్పీఎస్ బాండ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, 2017 వేతన సవరణకు సంబంధించిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, అలవెన్సులను తక్షణమే సవరించాలని, 2021 వేతన సవరణ అమలు చేయాలని, ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేసి ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలను అనుమతించాలని కోరారు. మహాలక్ష్మి స్కీమ్ వల్ల జరిగే అనర్థాలకు కండక్టర్‌ను బాధ్యుడిని చేయడం మానుకొని సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని, చనిపోయిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కొత్త నియామకాలతో పాటు బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీలో గత పదేళ్ల నుంచి పెరుగుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపోలో జేఏసీ నాయకులు బేతంపూడి బుచ్చిబాబు, దేశ బోయిన జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలి

ఖమ్మంమయరిసెంటర్: దేశంలో మతోన్మాద శక్తులు సోషల్ మీడియాను వాడడం ద్వారా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని ప్రజల ఐక్యత కోసం మతోన్మాద చర్యలకు వ్యతిరేకంగా సోషల్ మీడియా వారియర్స్ పనిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం రెండో రోజు సీపీఎం సోషల్ మీడియా రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. సోషల్ మీడియా సామాన్య ప్రజల చేతుల్లో ఆయుధమని, తమ సమస్యను వెలుగెత్తి చాటడానికి అభిప్రాయాలను పంచుకోవడానికి ప్రజా వేదికగా ఉపయోగపడుతుందన్నారు. దాన్ని మతోన్మాద సంస్థలు విచ్ఛిన్నకర శక్తులు తమ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయన్నారు. అబద్ధ ప్రచారాన్ని తప్పుడు న్యూస్ వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు. వాటిని తిప్పి కొట్టి ప్రజా గొంతుగా సోషల్ మీడియా కార్యకర్తలు పని చేయాలని కోరారు. సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యుడు పిట్టల రవి అధ్యక్షతన తరగతులు నిర్వహించగా.. కార్యక్రమంలో సోషల్ మీడియా రాష్ట్ర బాధ్యులు జగదీష్, వై.విక్రం, సుందర్, యాటల సోమన్న, శంకర్, నర్సిరెడ్డి, గొడుగు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

ఖమ్మంమయూరిసెంటర్: పశ్చిమబెంగాల్‌లో ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో ట్రెయినీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి డిమాండ్ చేశారు. మంగళవారం పీఓడబ్ల్యూ జిల్లా కమిటీ సమావేశం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో గోకినేపల్లి లలిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోదీ పాలనలో కుటుంబపరంగా, పని ప్రదేశాల్లో లైంగిక దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా దుండగులను శిక్షించడం లేదని, డేరాబాబా, ఆశారాం బాపు, బోలె బాబా అనారోగ్యాల సాకులతో పెరోల్ పైన బయటనే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎ.మంగతాయి, ఉపాధ్యక్షురాలు టి.ఝాన్సీ, సహాయ కార్యదర్శి శోభ, సభ్యులు పరిమళ, అనసూయ, చైతన్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై హర్షం

ఖమ్మంమయూరిసెంటర్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీ లిక్కర్ విధానంతో కవితకు సంబంధం లేకున్నా ఈడీ అక్రమ కేసు బనాయించి 168 రోజులు జైలులో పెట్టిందని తెలిపారు. ఏదిఏమైనా ఆమెకు బెయిల్ మంజూరు చేయడం హర్షణీయమని పేర్కొన్నారు. కాగా, ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరవడంపై ఖమ్మంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, నాయకులు గుండాల కృష్ణ, తాజుద్దీన్, బెల్లం వేణు, భాష బోయిన వీరన్న, పగడాల నరేందర్, లింగన బోయిన సతీష్, ఆసిఫ్, టెంకటి సందీప్, మరియు సద్దాం, మాటేటి కిరణ్, సతీష్, మంచా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద బాణాసంచా కాలుస్తున్న నాయకులు

రేపటి నుంచి 'ఉపాధి'పై సామాజిక తనిఖీలు

కూసుమంచి: ఈ నెల 29 నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై మండలంలో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇట్టి సభలు సెప్టెంబర్ 5వ తేదీ వరకు కొనసాగుతాయని, అదే రోజున మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా వేదిక నిర్వహించబడుతుందన్నారు. గ్రామ సభల నిర్వహణపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6.65 కోట్ల పనులపై సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు వివరించారు. ఇందుకోసం 18 బృందాలు మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో ఆడిట్‌ను నిర్వహించి గ్రామసభలు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అప్పారావు, ఈసీ కరుణ, ఎస్‌ఆర్పీలు సాంబశివాచారి, కాశన్న సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మాణ పనుల అడ్డగింత

నేలకొండపల్లి: కోదాడ–ఖమ్మం జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలోని పైనంపల్లి వద్ద గ్రామానికి చెందిన యర్రా కోటేశ్వరరావు తన ఇంటిని కోల్పోయారు. ఇంటికి పరిహారం పూర్తి స్థాయిలో ఇంక అందనేలేదు. అయితే ఇప్పుడు బస్‌షెల్టర్ నిర్మాణానికి సంబంధిత అధికారులు మార్కింగ్ ఇచ్చిన చోట కాకుండా.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అక్కడ నుంచి కోటేశ్వరరావు దుకాణం వద్ద మంగళవారం మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. ఆగ్రహించిన బాధితుడు జేసీబీ పనులను అడ్డుకున్నాడు. ఇల్లు పోగా మిగిలిన 40 గజాల స్థలంలో దుకాణంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుంటే ఇప్పుడు దుకాణం ముందు బస్‌షెల్టర్ కడితే ఎలా బతకాలని ఆగ్రహించడంతో సదరు కాంట్రాక్టర్ అక్కడే కట్టాలని పట్టుబడగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలని, లేని పక్షంలో కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈమేరకు కలెక్టర్, జాతీయ రహదారులు అధికారులకు వినతిపత్రాలను అందించారు.

'త్రివేణి'లో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు



అనాథాశ్రమానికి అందించిన సామగ్రితో పాఠశాల విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి మాట్లాడుతూ.. విద్యార్థులకు సేవ చేసే గుణాన్ని అలవాటు చేయాలన్నారు. పాఠశాల విద్యార్థులు తాము తెచ్చిన పండ్లు, బ్రెడ్ మొదలైన వాటన్నింటిని నగరంలోని అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపించారు. కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలితో మహిళలు ఎదుర్కొంటున్న వ్యాధుల్లో బ్రెస్ట్ కేన్సర్ ఒకటని యూ వుయ్‌కెన్–యువరాజ్ సింగ్ ఫౌండేషన్ రీజినల్ డైరెక్టర్ రీసాశెరిల్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఐక్యుఏసీ, జువాలజీ విభాగం, హెల్త్ ఇనిషియేటివ్ ఆధ్వర్యాన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు యానిషెరాన్, కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు బానోత్ రెడ్డి, శాస్త్రి, అధ్యాపకులు సునంద, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో...

ఖమ్మం సహకారనగర్: మన భవిష్యత్ మనం చేసే పనులపైనే ఆధారపడి ఉంటుందని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, వాటి కోసం రూపొందించాల్సిన ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో చేరిన మొదటి రోజు నుండే పలు ప్రముఖ సంస్థలతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ మూసి నిర్మాణం చేస్తున్నారంటూ ఫిర్యాదు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని వైరా–ఖమ్మం ప్రధాన రోడ్డులోని వెలుగుమట్ల అటవీపార్కు దారి సమీపాన ప్రధాన రహదారిగా ఉన్న డ్రెయినేజీని మూసి నిర్మాణం సాగిస్తున్నారని అందిన ఫిర్యాదుపై మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. సాగర్ ప్రధాన కాల్వకు, ప్రధాన రహదారి మధ్యలో ఉన్న డ్రెయినేజీకి ఆనుకొని నిర్మాణం సాగిస్తున్నారని గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన ఎం.వీరయ్య మోపెడ్‌లో పెట్రోల్ పోయించుకుని నేలకొండపల్లి వైపు వస్తున్నాడు. ఈక్రమంలో నేలకొండపల్లి నుంచి కూసుమంచి వైపు వెళ్తున్న ప్రభుత్వ వాహనం ఢీకొట్టగా.. వీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు నేలకొండపల్లి ప్రభుత్వాస్పత్రి, ఆపై ఖమ్మం తరలించారు.

పాలేరులో ఘనంగా ఉట్ల పండుగ

కూసుమంచి: మండలంలోని పాలేరు గ్రామంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని యాదవ సంఘం ఆధ్వర్యాన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఉట్ల పండుగను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అనంతరం సుమారు 50 అడుగులు పైగా పొడవున్న ఓ ఇనుప స్తంభానికి గ్రీజు పూసి చివరన అరిసెలు, బహుమతులను ఉంచి పైకి ఎత్తగా వాటిని అందుకునేందుకుపోటీ యువకులు పోటీ పడ్డారు. చివరకు పలువురు యువకులు అరిసెలు, నగదు బహుమతులు దక్కించికుని విజేతలుగా నిలిచారు. జీళ్లచెరువు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాల ఆధ్వర్యాన ఉట్ల పండుగను ఘనంగా నిర్వహించారు.



స్తంభం ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

నిధులు రాక.. నిలిచిన పనులు..



నేలకొండపల్లి ప్రభుత్వ కాలేజీలో అసంపూర్తిగా ఉన్న టాయిలెట్లు



పిండిప్రోలు కాలేజీలో పూర్తి కాని టాయిలెట్ నిర్మాణం

ప్రభుత్వ కాలేజీల్లో అసంపూర్తిగా టాయిలెట్ల నిర్మాణాలు

- ఒక్కో కాలేజీకి రూ.9.20 లక్షల చొప్పున నిధుల మంజూరు
- బిల్లులు రాక మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు

నేలకొండపల్లి: విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం నిర్మించిన టాయిలెట్లు పూర్తి కాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. దీంతో వారి బాధలు ఎవరికి చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే కాలేజీల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధికారులు నానా ఇక్కట్లు పడుతున్న సమయాన ఇలాంటి సమస్యలు వెంటాడుతుంటే విద్యార్థులు ఎలా చేరుతారని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పనులు ప్రారంభించి, బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.9.2 లక్షల చొప్పున నిధులు..

పాలేరు నియోజకవర్గంలోని నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.9.20 లక్షల నిధుల చొప్పున మంజూరు చేసింది. అయితే గత నాలుగు నెలల క్రితమే వీటి నిర్మాణాల పనులను ప్రారంభించారు. ఇందులో నేలకొండపల్లి కాలేజీలో దాదాపు 60 శాతం వరకు పనులు పూర్తికాగా, పిండిప్రోలులో పిల్లర్ల దశకు చేరుకుంది. కాగా, ప్రభుత్వం ఇప్పటి వరకు తమకు రూపాయి కూడా చెల్లించలేదని పేర్కొంటూ సదరు కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. దీంతో ఆ పనులన్నీ అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

స్పందన కరువు..

ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదని విద్యార్థి సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నేలకొండపల్లి, పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో వందల మంది విద్యార్థి, విద్యార్థునులకు ప్రధాన సమస్య అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు విడుదల చేసి, పనులు నూరు శాతం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు, పేరెంట్స్ కమిటీ, విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

చిత్తశుద్ధి నిరూపించుకోవాలి..



ప్రభుత్వానికి విద్య పట్ల చిత్తశుద్ధి లేదు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్న వ్యాఖ్యలు కేవలం ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పాగర్తి సుధాకర్, బీసీ సంఘం నాయకుడు

బాధలు పట్టించుకోవాలి..



ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. కనీసం టాయిలెట్లకు బిల్లులు చెల్లించలేకపోతుంది. విద్యార్థుల అవస్థలు పడకుండా అసంపూర్తి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– మస్తాన్, విద్యార్థి సంఘం నాయకుడు

పనులు పూర్తి చేయాలి..



ప్రభుత్వ కాలేజీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకపోవడంతోనే విద్యార్థులు చేరడం లేదు. సమస్యల పరిష్కారం కోరం ఉద్యమాలు చేసేదాకా పనులు పూర్తి చేయరు. వెంటనే పనులు పూర్తి చేయకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తాం.

– పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త